# గాలి

+

రచన :
"రామ్ శ్రీ"

'అమ్మో' అంటూ మా అమ్మాయి పడిపోయిందా నాటిరాత్రి ఎనిమిది గంటలకు - అందరికి ఆశ్చర్యం వేసింది. మామూలుగా చక్కగా నవ్వుతూ మాట్లాడుతున్న మనిషి-యిలా అయేసరికి అదిరిపడి, ఏ విషయం లోనో వచ్చిందని భయపడి పోయారు. ఇంట్లో అద్దెకు వచ్చినవారందరూ గుమిగూడారు ఏమిటేమిటని?

నేనేమీ మాట్లాడక వూరుకున్నాను. ఏం చేయను? 'లలితా అలా చూడు ఏమిటో?' అన్నాను సహజ ధోరణిలో, అందరికి అదుర్దా వినిపించేలాగ.

'ఏంఅమ్మా! ఏంజరిగింది?' అంటూ ఆవిడ మామూలు ధోరణిలో లోపలికి వచ్చింది. అల్లుడు నిశ్చేష్టుడైపోయాడు! అతనికేం తెలియదు! పెళ్ళయి ఆయిదారు వత్సరాలేగా!

కొంచెంసేపటికి తెప్పరిల్లింది. ఏమిటి? అని అందరూ అడిగారు. ఏమీలేదు 'కల' వచ్చిందంది. ఏమా కల? నిజమా? ఏమో?' కాని అందరికీ అనుమానం వేసింది!

కొంచెంసేపయ్యాక 'విభూతి' తెచ్చాను. అది చూచేసరికి మళ్ళీ అంటూ పరుగెత్తింది. మెల్లిగా పట్టుకొని వచ్చి ధైర్యంతో ఆ విభూతి పెట్టాం. ఆనాటికి తగ్గిపోయింది. ఏమిటో? అంతే జరిగింది.' అని రామం ముగించాడు.

'అయితే రామం అసలు ఆవిడ అలా అనటానికి కారణం?' అన్నాను నేను.

రామం నిట్టూరుస్తూ యిలా అన్నాడు. 'ఒరేయ్ ధాశరధీ యిదంతా మన కర్మరా! ఎవరేం చేయగలరు? నేను ఏదైతే నమ్మనో, నాయందు నమ్మకం పుట్టించ


ఫోన్ నెం: 315

KPS PRODUCTION.

తంతి విలాసం: "KEPEEYES"

ఇండియా అంతా కోరునట్టి — అత్యధికంగా విక్రయింపబడునవి.

మా చేనేత వస్త్రాలే!!

వ్యవసాయదారులు, మిల్లుకార్మికులు, మరియు పురజనులు, మా 'కె పి యస్' తువ్వాళ్లను, నేప్‌కిన్స్‌లను, దుప్పట్లను, పంచలను మాత్రమే కొని ఉపయోగించెదరు.

అందరి ఆదరాభిమానాలనే ఎల్లప్పుడూకోరే,

తమ అభిమాన పాత్రుడు

కె. పి. సుబ్బయ్య.

[చేనేత వస్త్రాలను తయారుచేసేవారు, ఎగుమతిదార్లు.]

నెల్లూరు : : మధురై -2 (S.I)

తేరో; చిన్నతనంలో ఏదంటే లెక్క చేయనో, వాటి యందు పూర్తి విశ్వాసం, నమ్మకం అమరాయి! యీ నాటికి!'

'వాడు చెప్పేతోంటే నాకెంతో ఆశ్చర్యం వేసింది.' అవున్రా! నమ్మకేంచేయను. కళ్లారా కన్పడ్తుంటే' అన్నాడువాడు పెద్ద భారం వదల్తున్నట్టుగా.

అసలువిషయం ఏమిటి? ఆలా మీ అమ్మాయిపడిపోవ టానికి కారణం ఏమిట్రా? అన్నాను-

వాడన్నాడు 'ఏముందిరా. చివరికి ఏవో 'గాలి' అన్నారు. ఎవరోకాదు ఆవిడే! నా ప్రాణానికి వచ్చింది' అన్నాడు. ఆమాట అనేసరికి నోరు వణకింది కాళ్లు కద లాయి! చేతులు వణకాయి. కళ్లు చెమ్మగిల్లాయి.

'ఎవర్రా!?' అన్నాను తొట్రుపాటుతో!

'ఆవిడే' అన్నాడు ఏమిటో అగమ్యంగావుంది. ఎవ రావిడ?

* * *

నేను విశాఖపట్నంలో ఉద్యోగంచేసే రోజులవి. కింగ్ జార్జి ఆస్పత్రి ఎదురుగానున్న రోడ్డుకు దక్షిణ వైపుగానున్న బజారులో, కుడిప్రక్క యింటిలో వుండే వాణ్ణి! అవి క్రొత్తగా పెళ్ళినరోజులు. ఆయిల్లు రెండు గదులు. ముప్పయి రూపాయలు పుచ్చుకుంటారు ఏం చేయను. విజయవాడకంటె ఎక్కువఖర్చు పట్టణం. నేనాయింటికి చేరిన రోజులలో ఆయింట్లో ఓ పంతు లమ్మ ఆ ప్రక్కవాటాలో చేరింది!

'ఏమండీ!' అంటూ ఎంతో పరిచయం ఉన్నదానిలా పలకరించింది.'

'ఏమండీ' అన్నాను.

యిలా మా పరిచయం అయింది. అపుడపుడు మా యింట్లో పుస్తకాలు అవి తీసికొని వెళ్తుండేది మా యింట్లో ఓమనిషిలా తిరగడం మొదలెట్టేది. ఆవిడను చూస్తే నాకు ఎంతో జాలివేసేది ఒక్కమనిషి. మాట ఆలో చాల తమాషా వుండేవి. ఎంతో నవ్వుతూ మాట్లా డుతుంటుంది.

'ఏమండీ మీరీ ఉద్యోగం చేయటంలో ఉద్దేశ్యం' అన్నాను ఓనాడు.

'ఏముందీ ఉదరపోషణార్థం'

'ఊహు' మీదేవుగారు అన్నాను సంభాషణను పొడి గిద్దామని. ఆమెను మాట్లాడిస్తుంటే నాకో రకమైన ప్రేమ, అనురాగం పుట్టుకొచ్చేది. మనిషి నాజూకుగా వుండేది. నల్లటి మనిషి. ముఖంలో ఛాయివున్నా, కళ ఉట్టిపడ్తూంది ఆనాడావిడ కనకాంబరం చీర కట్టి, నీల వర్ణం జాకెట్టు తొడిగింది. జాకెట్టులోంచి తెల్లటి వాయిలు బాడీ కన్పడ్తుంది. కొంచెం పొట్ట కన్పిస్తూ పమిట ఓప్రక్క వేసికొని, చక్కగా అలంకరించు కొంది. జడవేసికొని ముడివేసికొని వెనుక 'వలను' చుట్టింది.

చెవులకు ఐదురాళ్ల ఎరుపురాళ్ళ దిద్దులు అమర్చింది. ముక్కుకు బేసరి వుంది. మెల్లో నాలుగుపేటల కాఫీ గింజల గొలుసు వేసికొంది.

పమిట చేత్తో పట్టుకొని 'ఏమిటి చేయమంటారు. మనిషి మనిషిలా నే వుంటారు. పైకి సంతోషంగా కన్పిం చినా లోలోపల కుమిలిపోతుంటారు 'విధి' లేక బ్రతుకు వెళ్ళబోసుకోవడం అంటే మరీబాధ. అందులో 'స్త్రీ' ఉద్యోగానికి బయుల్దేరిందంటే వేరేచెప్పనక్కర్లేదుగా!' అంది క్రిందకు చూస్తూ-

యింతలో 'లలిత' వచ్చింది. కాఫీ పట్రమన్నాను. లలిత అనేక రకంగా చూస్తూ—'యిద్దరికేనా'అన్నట్టు నావంక చూచింది. కళ్ళలో చెప్పాను.

'వద్దండీ యిపుడే తీసికొన్నాను.' అంది అనుమా నిస్తూ-

'పర్వాలేదు పుచ్చుకోండి కాఫీయేగా ఎన్నిసార్లు అయినా పుచ్చుకోవచ్చు' అంది మా ఆవిడ నవ్వుతూ-

'అంతవరకే ఎన్నిసార్లు అయినా త్రాగే ఓర్పు మా కుండొద్దూ. అలవాటుచేసే బాధ్యత మీది. అతర్వాత పడేబాధ మాది అలవాటయ్యాక చస్తాం. యిప్పటికే ఒకసారికే బాధపడ్తున్నాం మరి' అంది మా లలితతో పాటు నవ్వుతూ-

'అయితే రోజూ రండి త్రాగుదురుగాని' అంది మా లలిత-

'బాగుంది యీయింట్లో వున్నంతకాలం మీరిస్తారు. యిల్లు మారితే' అంది మళ్ళీ.

'పోనీ మాయింట్లోనే వుండిపొండి' అన్నాను. అం

Mahalakshmi Iron Works
(ESTD: 1921)
72, SOUTH AVANI MOOLA STREET
MADURAI-1 (S.I.)




Specialist in Manufacture of
COLLAPSIBLE GATES & SHUTTERS
ORNAMENTAL GRILLES. WINDOWS.
COMPOUND GATES & RAILINGS.
STEEL TRUSSES
ENQUIRIES INVITED

Catalogue on Request


దుకు మా లలిత నవ్వింది. ఆవిడ, నేనూ ఒకేసారి లలిత వంక చూచాం. ఎందుకో ఆనవ్వు నాకర్థం కాలేదు.

'సరే! వస్తానండి' అంటూ వెళ్ళిపోయింది మెరుపు తీగలాగ. ఆవిడవంక అలా చూస్తూ ఉండిపోయాను. 'ఏమండోయ్' అని మా లలిత కేక వేసేవరకు-యీ ప్రపంచాన్ని మర్చిపోయాను.

'ఏమండోయ్' అంది మళ్లీ.

'ఆ...' అన్నాను. 'ఆవిడ కట్టుకున్న చీరెలా వుంది' అన్నాడు. నవ్వుతూ ఆదోరకంగా చూస్తూ.

'ఇంకా నయం, ఆమెలా వుండలేదా?' అంది.

'అది వేరేవిషయం' అంటూ 'అటువంటి చీర నీకు వుంటే బావుంటుందికదూ! ఆవిడ కాచీర బావుండలేదు, ఆమెకు తగ్గచీరకాదు' అన్నాను మళ్లీ.

'ఆమెకు ఏ చీర బావుంటుంది?' అంది మళ్లీ.

'నీకు తెలియాలి' అన్నాను. తర్వాత అనుకొన్నాను. అది మాట్లాడేది లలితతో అన్నవిషయం. సంభాషణ మార్చాను.

* * *

ఆనాడు ఓ పత్రిక చేత్తో పట్టుకొని చూస్తున్నాను. అది పాత పత్రిక. అందులోంచి ఓ కవరు క్రిందపడింది. ఆశ్చర్యంతో చూచాను. శ్రీ వారికి...అని వ్రాసివుంది. ఎవరా అని ఆలోచించాను. 'ఆవిడే!' చదివాను. 'మిమ్మల్ని చూచినప్పట్నుంచి నా మనస్సు పరిపరి విధాల పోయింది. ఏంచేయను. 'స్త్రీ'లకు కోరిక వుంటుందని మీకు తెల్సు. మిమ్మల్ని చూడగానే ఆ కోరిక మళ్ళీ జనించింది. మీతో మాట్లాడ్తుంటే నాకు కాలం గడిచినట్లే లేదు. ఇంకా మీతోనే వుండాలనిపిస్తోంది. ఎంతో హాయిగావుంది. మీ జవాబు వ్రాయండి. ధైర్యంతో వ్రాస్తున్నందుకు క్షమించండి. మీరు వివాహితులని తెల్సు. తనంతటా వలచివచ్చిన చుల్కన అవుతారనికూడా తెల్సు. అదంతా మీరే తేల్చాలి! వ్రాశాను కదా అని నల్గురిలో అవమానం చేయకండి. మీయిష్టం అయితే జవాబు వ్రాయండి.'

అది చూసేసరికి కళ్లెర్రబడ్డాయి. ముచ్చెమట్లు పోశాయి. ఎంతధైర్యం. యిదేనా చేయవల్సినపని. నవ్వుతూ మాట్లాడితే యిదేనా చేసేది. అనుకొన్నాను. కాని 'అవమానం చెయ్యొద్దు' అన్న వాక్యం నాకు జ్ఞప్తికి వచ్చింది. ఆవిడను అనుమానంచేస్తే మనకు జరిగే

దేమిటి?' అనుకొని మనస్సులో నవ్వుకున్నాను. 'నాకూ ఆ కోరిక లేదూ?'

మనస్సులో ఎంతో వర్ణించుకొన్నాను. అవును-ఎలాగయినా జవాబు యిద్దామనుకొన్నాను. ఏమి యిచ్చానో నాకేం తెలియలేదు. అప్పట్నుంచి మాయింటికి రావడం ఎక్కువ అయింది. ఎంతగానో నవ్వుతూ మాట్లాడేది. 'నా...'అనుకొనేవాణ్ణి!...

* * *

మా ఆవిడ పురిటికి విజయవాడ వెళ్లిపోయింది. వంటపని నేనే చేసికొనేవాణ్ణి. నాల్గురోజులు అవస్థపడ్డాను. ఒంటరివాణ్ణిగదా. కాస్త సహాయం చేద్దామని ఆవిడ వుండొచ్చు. యిదేనా మర్యాద. పైగా ఏదో రాసింది. నన్ను తెల్సుకోవటానికి వ్రాసిందా? నా తెలివి అనుకొంటుండగా ఆవిడవచ్చింది.

'పాపం వంటపనిలో ఎంత సతమత మవుతున్నారు. నాకు చెప్పకూడదటండీ! నే చేసిపెట్టను' అందినవ్వుతూ ముఖంలోకిచూస్తూ-

'పాపం మీకెందుకీకష్టం ఒకనాటిదా? అయినా వంట వగైరాలకు యిబ్బందిగానే వుంది కదండీ!' అన్నాను. లోపల యిష్టమైనట్లు-

వెంటనే చేత్తో గరిట పుచ్చుకొంది. ఏదో వంట చేసింది. మర్నాడునుంచి వారింట్లోనే వంటచేసేది. వద్దన్నా వూరుకొనేదికాదు. ఆప్యాయత. అనురాగం. 'ఆడది' తన్ను తలచిన మనిషికి ఏదైనా పెట్టగలదు. ఏదైనా చేయగలదు - వారెంతయినా సమర్థులు అనుకున్నాను.

రోజులు అలా గడిచిపోతున్నాయి. ఆమె చేయు సహాయమునకు ఎంతో మురిసిపోయాను. 'ఎంత మంచిది? అని పైకి అనుకొన్నాను!

అప్పటికి మా ఆవిడపోయి అయిదు నెలఅయింది. ఆ నాడు ఎందుకో బుద్ధి పరిపరివిధాల పోయింది. మనస్సు ఎక్కడికోపోయింది!

అప్పుడే ఆవిడవచ్చి వంట ప్రారంభించింది. అలాగే చూస్తుండిపోయాను.

'ఏమండీ అలా చూస్తారూ?' ఏమీలేదు అన్నాను. మెల్లిగా లోపలికి వెళ్ళాను. ఎంత ధైర్యం అనుకొన్నాను. చీర పట్టుకొన్నాను. ఆవిడ ఏమీ మాట్లాడలేదు. ఏమిటో ఆ చొరవ?...గట్టిగా పట్టుకొన్నాను!

'వూరుకోండి' అనికూడా అనలేదు. ఎంత హాయి... ఆనందంలో మునిగిపోయాం. అలా ఎంతసేపు ఉన్నామో తెలియదు. తర్వాత తెల్సింది. పొరబాటుచేశానని!

'ఎంత అందంగా వున్నావు సుశీ!' అన్నాను అదోకరకంగా చూస్తూ-

'మీ ఆవిడ వుంటే ఏమి అనుకొంటుంది చెప్పండి. ఎంత అవమానం. యిదేంపని...అబ్బ!' అంది. జడను పట్టుకొన్నాను. దాన్ని వదలించుకోవాలని ప్రయత్నంలో!

'లేదుగా' అన్నాను నవ్వుతూ బుగ్గమీద చిటికవేస్తూ.

'ఎంత బుద్ధిమంతులు?' అంది. అవును ముందు జాబు వ్రాసిందెవరో?' అన్నాను. కోపంవచ్చినట్టుంది 'పొండి' అంది. 'సుసీ అంతకోపం అయితే ఏలా.' బుజ్జగిస్తూ అన్నాను.

ఆనాడెంతో సుదినం. ఏనాటినించో చేసిన ప్రయత్నం ఫలించింది. కోరిక తీరింది అయితే-

'మీ కోరిక తీరిందిగదా అని నన్ను అవమానం చేయకండి. మీదాన్ని అయిపోయాను! ఏం చేసినా మీదే. మిమ్మల్ని విడువలేను. నా బ్రతుకు అవమానపాలు చేయకండి. మీరేనాకు భాధ్యులు.' అంది ఆవిడ. 'ఊ!' అన్నాను. అబ్బా!' 'సుశీ!'...

* * *

అలాగే రోజులు గడిచిపోయాయి.

మా ఆవిడవద్దనుంచి వుత్తరం వచ్చింది 'అమ్మాయి' పుట్టిందని సంతోషం అయింది. వార్త ఆవిడకు చెప్పాను వెళ్ళిరమ్మంది అచ్చు అమ్మాయి అంతా నా పోలిక బొద్దుగా వుంది.

పదకొండో రోజున పేరుపెట్టాల్సివచ్చింది. ఏదో పెట్టాం. నాకు అంత సంతృప్తికరంగాలేదు. ఏదో అన్నాను ఏలా పెట్టాలి? అనేదే నామనస్సులో వుంది ఎవరేం అనుకొంటేం!

* * *

నాకు విజయవాడకు ట్రాన్స్‌ఫర్ అయింది. ఏం చేయను: ఆవిడను వదలిరా బుద్ధిపుట్టలేదు! ఆవిడెంతో ఏడ్చింది. మామూలుగా ఆప్యాయతతో ఏడ్చిందోనని లలిత అనుకుంది. కాని మా సంబంధం ఆవిడకు తెలియదుగదా!

'సుశీ! ఏం దిగులుపడకు. నిన్ను మర్చిపోలేను. ఎక్కడున్నాగానీ బాధ్యత నాది మర్చిపోను ఎప్పుడైనా జాబులు వ్రాస్తూండు! అన్నాను.

'అలాగే! అంది ఆవిడ. రైలు వదలిపోయింది ఆవిడ అలాగే నిల్చుంది.

నాకు మనస్సు ఆగలేదు. విజయవాడ వచ్చాను గాని నాకు ఏంతోచేదికాదు. కలలో కన్పిస్తుందేది ఆవిడ! మనిషి మారిపోయాను ఎంతో మంచిది. అపుడపుడు జాబులు వస్తూండేవి! మాద్దామనుకునేవాణ్ణి. అంత దూరం పోవాలంటే మాటలా! అలాగే ఓసారి వెళ్ళి చూచివచ్చాను ఎంతో మారిపోయింది. ఎంతో ఏడ్చింది.

నాకు రావటానికి మనసొప్పలేదు. విధిలేక విడిచి వచ్చాను. ఎంతో ఆప్యాయత చూపే ఆవిడను వదలి రావటానికి విచారం వేసింది.

* * *

'మీకు గాయాలని చాలారోజుల్నుంచి అనుకుంటున్నాను. నేను 20 రోజుల్నుంచి ఆస్పత్రిలో చేరాను. మందులిస్తున్నారు. తగ్గుతుంది నాకేమీ కన్పించడంలేదు. మీరొకసారి వస్తారని ఆశిస్తున్నాను-సుశీ'—యీజాబు చూచాక పోదామనిపించింది ఆలోచిస్తున్నాను. యింతలో పోస్టుమేన్ టెలిగ్రాం మనియార్డరుతో యిచ్చాడు 'వెంటనే రమ్మని'

ఏడ్వాలని అనిపించింది. పాపం. ఎంతో ప్రేమ? తన్ను చూడటానికి రావటానికి డబ్బు పంపింది.

'లలితా' అని పిల్చాను. ఆవిడ ఆదోరకంగాచూస్తూ- విశాఖపట్నం బయల్దేరు అన్నాను. ఆవిడేం మాట్లాడలేదు.

విశాఖపట్నం జనతా చేరేసరికి 1 గంటయింది. వెంటనే ఆస్పత్రి చేరాను.

అప్పుడే ప్రాణం పోయిందన్నారు వైద్యులు. 'హు' చివరిచూపు అందలేదు. ఏంచేయను. (సుశీ) వెంటనే బయల్దేరి వచ్చాను. నాకు ముందుగా ఎందుకు రాయకూడదు? ఎంతపనిచేశావ్? అని ఎంతో విచారించాను.

లోలోపల ఏడ్చాను. అవును. ఎంతో అనురాగం చూపి ప్రేమ చూపిన ఆవిడను వదలినందుకు-లోకాన్ని విడిచి పోయినందుకు విచారించాను.

చేయవల్సిన కర్మకాండ జర్గింది. 'లలిత' ఏదో అడగాలనుకుంది కాని సమాధానం వస్తుందో రాదో ననుకొందో అడగలేదు. 'పాపం! మీకు నేను వూళ్ళో లేనపుడు చాల సహాయం చేసింది. ఎంతో మంచిది!' అంది లలిత. అవును. దానికి అంతవరకే తెల్సు.

ఇంటికి వచ్చాను. ఒక రోజున యిన్సూరెన్సు ఆఫీసు నుంచి జాబు వచ్చింది. సుశీల తాలూకు యిన్సూరు రెండు వేలరూపాయలు, మైనరు తరపున మాకివ్వడమైనది. అదీ ఆశ్చర్యం. ఆమె తాలూకు డబ్బు మా అమ్మాయి కిచ్చింది. ఎంత ఆపేక్ష! మా అమ్మాయి అదృష్టవంతురాలు!

తర్వాత మా అమ్మాయికి మూడో ఏడు వచ్చింది. ఆనాడు ఎందుకో హఠాత్తుగా పడిపోయింది. మందులు పోసినా, వైద్యులకు అంతు చిక్కలేదు. చివరికి తేలింది 'గాలి' అని సారాంశం యీవిడే! ఆవిడకు కోరికలు తీరలేదు! అందుకనే యీవిడ యీపని చేసివుంటుందని ఆలోచించాను. ఎంతపని చేసిందని దుఃఖించాను. ఆమెకు తీరనికోరిక అనుకొని తృప్తిపడ్డాను.

* * *

అప్పట్నుంచి ఆవిడ అలా వస్తూంటుంది. మా ఆవిడే అంది. ఎందుకయినా మంచిదని మా అమ్మాయి పేరు 'సుశీల'గా మార్చాను. అప్పట్నుంచి రావటం మానేసింది. పైగా ఏడాదికోసారి ఏవో పండక్కి చీర రవిక ఓ ముత్తయిదువుకు పెట్టుతుంది మా ఆవిడ! మళ్ళీ యీ రోజు వచ్చింది. మా అమ్మాయిని ఎంతో ఆప్యాయంతో చూసుకుంటున్నాను ఆవిడపేరు చెప్పుకొని.'

అని రామం ముగించాడు. నాకెంతో ఆశ్చర్యం వేసింది. 'రామం' చివరికి మంచిపని చేశావు. ఆవిడపేరు దక్కించావు.

'దాశరథీ! ఎవరో ఆవిడ మనమీద అంత ఆపేక్ష పెట్టుకుంటే లేదుగాని మనం చూపించేదేముందిరా!' అన్నాడు రామం.

'రెండు వేలు పుచ్చుకోలా?' అన్నాను ఎత్తిపొడుపుగా. వేలు దాచుకున్నదేగా హఠాత్తుగా పోతే అమ్మాయి గతేం కాను ఆలోచించుకో నేం దాశరథీ!' అన్నాడు రామం.

ఇంతలో కాంతంవచ్చి 'ఏమండీ కాఫీ' అంది. ఇద్దరూ కాఫీ పుచ్చుకున్నాం. షికారుకని అలా కృష్ణకు షికారు వెళ్లాం. 'ఏమండీ వెంటనే రండి!' అంది కాంతం.